క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని టీపీఎస్‌డీఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఏసీఎల్‌బీ, డీఆర్‌డీఓ, డీపీఓ, డీఎస్‌పీఓ వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయా శాఖల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ విడుదల చేశారు.

క్లాస్‌మేట్ క్లబ్ సేవలు అభినందనీయం

ఖిల్లాఘనపురం: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సోళీపురం ఉన్నత పాఠశాల దగ్గర క్లాస్‌మేట్ క్లబ్ 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ మండల కోశాధికారి రాఘవేందర్ తో పాటుగా పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ గ్రామంలో తిరుమలనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. తిరుమలనాథస్వామి ఆలయంలో సోమవారం యథావిధిగా పూజలు నిర్వహించి పూజారి నరేష్ ఇంటికి వెళ్లారు. రాత్రి గుడిలోకి వెళ్లి చూడగా తలుపుల పగులగొట్టి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ మంగళవారం ఉదయమే పోలీస్ కుక్కలతో వివరాలను సేకరించారు. తులం బంగారం, 450 గ్రాముల వెండి పోయినట్లు ఆలయ పూజారి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

కొత్తకోట రూరల్: అతివేగంగా వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన కొత్తకోట మండలం జాతీయ రహదారి 44పై పాలెం పెద్ద బ్రిడ్జిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనగానపల్లె నుంచి అట్టల (స్క్రాప్)లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న లారీ మంగళవారం తెల్లవారుజామున బోల్తా పడింది. డ్రైవర్ అజాగ్రత్త, లారీ అతివేగంగా వెళ్లడంతో బోల్తా పడి లారీ చక్రాలు విరిగిపోయాయి. దీంతో హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు గంట పాటు నిలిచాయి. హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి రాలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనలో డ్రైవర్ మహబూబ్‌పీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కరపత్రాల విడుదల



వనపర్తి టౌన్: లక్ష డప్పులు వెయ్యి గొంతుకల పేరిట మాదిగల సత్తా చాటేందుకు త్వరలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చేపట్టే సభ కరపత్రాలను మంగళవారం జిల్లా కేంద్రంలోని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ తిరుగులేని శక్తిగా పోరాటం చేశారని, ఆ పోరాటాన్ని నిలబెట్టేందుకు లక్ష డప్పుల మోతకు వెయ్యి గొంతుల కార్యక్రమానికి పిలుపునిచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో బోరెల్లి వెంకటయ్య, తగవుల శివన్ కుమార్, కేశపాగ కేశవులు, గంధం గట్టయ్య, కే.చెన్నకేశవులు, గంధం భగవంతు, డి.ప్రభాకర్, డి.ప్రవీణ్‌కుమార్, పానుగంటి రాజు, బలరాం పాల్గొన్నారు.

చెరువుకట్టపై సంతబజారు ఏర్పాటు చేయాలి

కొత్తకోట: శనగకట్ట చెరువుపై సంత బజారు ఏర్పాటు చేయాలని మంగళవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొత్తకోటలోని అంబా భవాని దేవాలయం సమీపంలో శనగకట్ట చెరువుకట్టను వెడల్పు చేసి సంత బజారును ఏర్పాటు చేస్తే ప్రజలందరికి ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీ కేంద్రంలో సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు వేసి, మంచి నీటి సౌకర్యం కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు కురుమన్న, నర్సింహులు, భాస్కర్, కృష్ణయ్య, బాలచందర్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనల మేరకు సాగు చేయాలి

పాన్‌గల్: పంటల సాగులో అధికారుల సూచనలు తప్పక పాటించాలని, మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్ తెలిపారు. యాసంగి మొక్కజొన్న సాగులో విత్తనాలు, ఎరువుల ఎంపిక పాటించాల్సిన నియమాలపై శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

సమన్వయంతో రోడ్ల విస్తరణ

- కర్నూలు రోడ్డు విస్తరణ బాధితులతో ఎమ్మెల్యే మేఘారెడ్డి



రోడ్ల విస్తరణ బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తిటౌన్: వనపర్తి పట్టణంలోని కర్నూల్ రోడ్డు విస్తరణలో పోలీసుల జోక్యం, అధికారుల బెదిరింపులు లేకుండా బాధితుల సమన్వయంతో ముందుకొచ్చేలా రోడ్ల విస్తరణ చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. రోడ్ల విస్తరణ కోసం విస్తృత సంప్రదింపులు, ప్రతి బాధితుడిని ఒప్పించేందుకు ఇంటింటికి తిరుగుతామని పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మహేష్ అధ్యక్షతన కర్నూల్ రోడ్డు విస్తరణ బాధితులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. విస్తరణ చేసేందుకు వ్యాపారులు నిశ్చింతంగా ఉండాలని వెల్లడించారు. మున్సిపల్, ఆర్అండ్‌బీ, ప్రభుత్వ, మాస్టర్ ప్లాన్, న్యాయస్థానాల నిబంధనలకు అనుగుణంగా ముందుకెళ్దామన్నారు. వ్యాపారుల అభిప్రాయాలపై అధ్యయనం చేయాలని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని కమిషనర్ పూర్ణచందర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, కమిషనర్ పూర్ణచందర్, డీఈ యూనోసు, కౌన్సిలర్‌లు జంపన్న, నక్కరాములు, బి. వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేసి విస్తరించాలి

రోడ్ల విస్తరణలో నష్టపోయే బాధితులకు న్యాయం చేసి రోడ్ల విస్తరణ చేయాలని వ్యాపారులు కోరారు. ఫుట్‌పాత్ వ్యాపారులను తొలగించాలని, 60–80 అడుగులు చేయాలని, రోడ్లను ఆక్రమించిన వాటిని తొలగించాలన్నారు. 9 ఏళ్లుగా రోడ్ల విస్తరణపై సరైన నిర్ణయం తీసుకోవడంలో మున్సిపాలిటీ విఫలమైందని ముఖాముఖి సమావేశంలో వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రవేట్ కంపెనీ ఇచ్చిన రూ.30 లక్షలతో పట్టణం ఎల్ఈడీ లైట్లు ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు కౌన్సిల్ తీర్మానం చేసింది.

విద్యారంగాన్ని పరిరక్షించే చర్యలు చేపట్టాలి



వీపనగండ్లలో యూటీఎఫ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించే చర్యలు చేపట్టడం వల్లే విద్యా సంస్థలు బలోపేతమవుతాయని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీ కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన 4 పెండింగ్ డీఏలను, పీఆర్‌సీని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భానుప్రకాష్, జిల్లా కార్యదర్శి బక్కన్న, శ్రీనివాసులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రయ్య, స్వామి, సీనియర్ నాయకులు జితేందర్‌గౌడ్, కృష్ణయ్య, ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్‌లు సాయిలత, శ్రీలత, కవిత, దేవేందర్, రంజిత్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా బెస్తకుల స్థాపిత సందీరి బాలయ్య వర్ధంతి



ఖిల్లాఘనపురం బెస్తగేరిలో సందీరి బాలయ్యకు నివాళులర్పిస్తున్న గంగపుత్రులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బెస్తగేరిలో బెస్తకుల స్థాపకులు సందీరి బాలయ్య 58వ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఖిల్లాఘనపురం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సంఘం బవనం దగ్గర ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త గోపాల్, డైరెక్టర్ కాడమోని శ్రీనువాసులు సందీరి బాలయ్య చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఖిల్లాఘనపురం సంఘం అధ్యక్షులు నారాయణ, మాజీ అధ్యక్షులు అంజనేయులు, గుగ్గిల బాలస్వామి, నర్సింహులు, బాలయ్య, వెంకటయ్య, శ్రీనువాసులు, బాయికాడి నారాయణ, శేషయ్య, యాదయ్య పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ పాఠశాలగా మామిడిమాడ

ఖిల్లాఘనపురం: హైబిజ్, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠం వారు ఉత్తమ ప్రభుత్వ పాఠశాలలకు అందించే అవార్డుకు వనపర్తి జిల్లా నుంచి ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు హెచ్‌ఎం చెన్నప్ప తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం చెన్నప్పతో పాటుగా ఉపాధ్యాయులు రవిశంకర్‌లు బుర్రానర్సయ్యగౌడ్, ఏఎస్‌పీడీ రాధారెడ్డి, ప్రీతిరెడ్డిల చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. జిల్లా మామిడిమాడ హెచ్‌ఎం, ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని, ఏఎంఓ మహానంది, ఎంఈఓ జయశంకర్ అభినందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పాన్‌గల్: మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వారి సాధారణ సెలవులు(సీఎల్)తక్కువగా వాడుకున్న ఉపాధ్యాయులను మంగళవారం విద్యాశాఖ జిల్లా అధికారులు చంద్రశేఖర్, మహానంది, ఎంఈఓ శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు జనవరి 2024 నుంచి డిసెంబర్ 2024 వరకు ఉన్న 22 సాధారణ సెలవులను వాడుకోకుండా పాఠశాలకు హాజరైన పాన్‌గల్ పీఎస్‌లో వెంకటేష్‌యాదవ్, రాయినిపల్లి పీఎస్ హెచ్‌ఎం తిరుపతయ్య, మాధరావుపల్లి పీ ఎస్ హెచ్‌ఎం వీరస్వామి, శాగాపూర్ పీఎస్‌లో సంధ్యారాణి, బుసిరెడ్డిపల్లి పీఎస్‌లో శిరీషలను సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ గాయకుడిగా చిన్నమందడి వాసి

కొత్తకోట రూరల్: జిల్లా బహుజన సాహిత్య అకాడమి వారు 17వ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ నేషనల్ అవార్డ్స్ కాన్ఫరెన్స్ నిర్వహించగా, పెద్దమందడి మండలం చిన్నమందడి గ్రామానికి చెందిన కొమ్ము నర్సింహ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ అవార్డుకు ఎంపికయ్యాడు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథులు గా విచ్చేసిన జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్

వనపర్తి విద్యావిభాగం: పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.మధుకర్ స్వామి ఆధ్వర్యంలో గ్రహణ మొర్రి, కాలిన గాయాలతో అవయవాలు వంకరలు, చేతి వేళ్ల వంకరలు, జన్యుపర లోపాల నివారణకు ప్లాస్టిక్ సర్జరీ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, గ్రీన్ ల్యాండ్స్ ఆఫ్ లైఫ్ క్లబ్, సేవా భారతి, మెర్సీ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 17, 18 తేదీలలో స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి జనవరి 20 నుంచి 30 తేదీ వరకు ఉచితంగా సర్జరీలు చేస్తారని, క్యాంపు కోసం నేటి నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ మెగా ఉచిత ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ అమెరికాకు చెందిన వైద్యులతో హైదరాబాద్ నగరంలో ఓల్డ్ మలేపల్లిలోని సీతారాం బాగ్ డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ హాస్పిటల్లో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ 9542433427 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఏఐయూకేఎస్ నిరసన

అమరచింత: ఈనెల 9న ఆల్ ఇండియా రైతు డిమాండ్స్ డే విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈనెల 9న రైతు జాతీయ డిమాండ్ డేగా గుర్తించాలంటూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. అనంతరం డీటీ రెడ్యానాయక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రాజు, సామేలు, కురుమన్న, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రిజిస్టర్ల పంపిణీ



అమరచింతలో సర్వీస్ పుస్తకాలను అందిస్తున్న ఎంఈఓ భాస్కర్ సింగ్

సాక్షి, నెట్‌వర్క్: అమరచింత మండలంలో కొత్తగా విధుల్లో చేరిన డీఎస్సీ అభ్యర్థులకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సర్వీస్ రిజిస్టర్‌లను ఎంఈఓ భాస్కర్ సింగ్ పంపిణీ చేశారు. పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు రాజశేఖర్ తండ్రి రామస్వామి జ్ఞాపకార్థం సర్వీస్ పుస్తకాలను అందించారు.

- పాన్‌గల్ మండలం పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో మిరాసిపల్లి పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ రాజశేఖర్‌తండ్రి రామ్మూర్తి జ్ఞాపకార్థం సర్వీస్ బుక్స్‌ను ఎంఈఓ శ్రీనివాసులు, కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్‌లు అందజేశారు.
- వీపనగండ్లలో పీఆర్‌టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత సర్వీసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంఈఓ నర్సింహులు, జీహెచ్‌ఎం భానుప్రకాష్, ఉపాధ్యాయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12తులాల బంగారు అభరణాలు అపహరణ
- 24గంటల్లోనే నిందితురాలిని పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న వనపర్తి డీఎస్పీ జె.వెంకటేశ్వర్‌రావు

వనపర్తి: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడ్డారు. 12తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఆదొంగలను 24గంటల్లోనే పట్టుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. వివరాలు.. స్థానిక లక్ష్మీ నరసింహాకాలనీకి చెందిన అల్వాల లక్ష్మీ శ్రీనివాసపురం(అగ్రహారం)లో కల్లుదుకాణంలో పనిచేస్తుంది. ఆమె భర్త రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. లక్ష్మీ తనకు సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలు, నగదును బ్యాగులో పెట్టి ఆసంచిని వారి బెడ్‌రూంలోని కప్‌బోర్డులో దాచిపెట్టింది. లక్ష్మీ రోజు పనికి వెళ్లే ముందుకు ఇంటికి తాళం వేసి తాళంచెవిని ఇంటి బయట చెప్పుల స్టాండ్‌లో ఉంచేది. ఆమె భర్త మధ్యాహ్నం ఇంటికొచ్చి భోజనం చేసి మళ్లీ ఇంటికి తాళం వేసి తాళంచెవిని అక్కడే పెట్టి వెళ్లేవాడు. సోమవారం ఉదయం 9గంటలకు ఇంటికి తాళంవేసి ఆమె కల్లు అమ్మేందుకు వెళ్లింది. రాత్రి 9గంటలకు ఇంటికొచ్చి చూడగా ఆమె దాచిన సంచిలో బంగారు, వెండి అభరణాలు, నగదు కనిపించకపోడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు లక్ష్మీ ఇంటికి చేరి పక్కన ఉండే గోపాల మహేశ్వరి అనే మహిళ తమదైన శైలిలో విచారించి నేరం ఒప్పుకుంది. ఆమె నుంచి రూ.18,900తో పాటు రూ.8,63,400 విలువ గల బంగారు వెండి అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నేరం జరిగిన 24గంటల్లోనే నిందితురాలని పట్టుకునేందుకు కృషిచేసిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందిచారు.

ఉపాధ్యాయుడికి ఫిర్యాదు చేశాడని..

- మూడో తరగతి విద్యార్థిపై దాడి



పాన్‌గల్: అభం, శుభం తెలియని వయసు వారిది.. తల్లిదండ్రులు, చదువు తప్ప వేరే ధ్యాస ఉండదు. కానీ వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలో అందుకు విరుద్ధంగా సహచర విద్యార్థిపై కక్షతో దాడికి పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల మేరకు.. పాన్‌గల్‌కు చెందిన జయ–బాలరాజు కుమారుడు అఖిల్ పాన్‌గల్ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న మరో విద్యార్థి గత నెల 30వ తేదీన తన పెన్సిల్ తీసుకున్నాడని బాధిత విద్యార్థి అఖిల్ ఉపాధ్యాయుడికి ఫిర్యాదు చేశాడు. దీన్ని మనసులో పెట్టుకున్న సదరు విద్యార్థి.. ఈ నెల 5న స్థానిక ఈదమ్మ గుడి వద్ద ఆడుకుంటున్న అఖిల్‌పై ఉన్నత పాఠశాలకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. అఖిల్‌ను కర్రతో బాదడంతో తలకు రక్తగాయమైంది. గమనించిన స్థానికులు విద్యార్థి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన విద్యార్థితో పాటు అతడి స్నేహితులు పరారీలో ఉన్నట్లు తెలిసింది. పెన్సిల్ తీసుకున్నాడని ఉపాధ్యాయుడికి చెప్పితే కోపంతో దాడిచేసి గాయపర్చడం ఏమిటని బాధిత విద్యార్థి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు. కాగా, విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్‌ఎం పద్మ బాధిత విద్యార్థి ఇంటికి వెళ్లి పరామర్శించారు. దాడికి పాల్పడిన విద్యార్థి రెగ్యులర్‌గా పాఠశాలకు రావడం లేదని.. గత నెల 30న హాజరై మళ్లీ ఇప్పటి వరకు రాలేదని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

రైతులకు ప్రభుత్వం పెద్దపీట

- రిపబ్లిక్ డే రోజున రైతు భరోసా
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



కొత్తకోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

కొత్తకోట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తకోట మున్సిపాలిటీలోని చౌరస్తాలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు రైతు భరోసా రూ.6 వేలకు పెంచుతూ ఇటీవల కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ జిల్లా కిసాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత పాలకులు రాళ్లకు, రప్పలకు, గుట్టలకు రైతుబంధు పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేశారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి షరతులు లేకుండా సాగుచేస్తున్న వ్యవసాయ భూములన్నింటికి రైతు భరోసా ఇవ్వయనున్నట్లు తెలిపారు. రిపబ్లిక్ డే రోజు భూమి లేని అర్హులైన నిరుపేదలకు ఏటా రూ.12 వేలు ఇస్తామని, త్వరలోనే రేషన్ కార్డులు ఇవ్వబోతున్నట్లు ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంత్, గొల్ల బాబన్న, కృష్ణారెడ్డి, ఎంజే. బోయేజ్, డాక్టర్ పీజే.బాబు, బీచుపల్లి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మన్యం, బాలరాజ్, జెఎం.మిషేక్, సలీంఖాన్, మోహన్‌రెడ్డి, నరేందర్‌సాగర్, జేసీబీ రాములు, రవీందర్‌రెడ్డి, సుభాష్, పెంటన్న యాదవ్, కురుమూర్తి నాయుడు, రామ్‌లాల్, రాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రైతు హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

వనపర్తి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో జిల్లా రైతు కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పంటలకు ఎంఎస్‌పీ చట్టం తీసుకురావాలని, రైతు ఉద్యమం సందర్భంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. పోరాటంలో అమరులైన వారి కుటుంబాలను ఆదుకోవాలని, వారిపై అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. భూ నిర్వాసితులకు 2013 చట్ట ప్రకారం పరిహారం అందించాలని కోరారు. భూ భారతి చట్టం త్వరగా అమలు చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు రాజేష్ పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



వాహన చోదకులకు గులాబీ పూలు అందిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి: రహదారి నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో జిల్లా రోడ్డు రవాణా అధికారి మానస, పోలీస్ సిబ్బందితో కలిసి హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి వాహనాలు నడిపే వారికి పువ్వులు అందించి అభినందించారు. వాహన చోదకులు విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. డీపీఆర్వో సీతారాం, సబ్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా యువతకు శిక్షణనిచ్చేందుకు నాగవరం శివారులో గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే తదితరులు పరిశీలించారు.

రుణ లక్ష్యం చేరుకోవాలి..

స్వయం సహాయక మహిళా సంఘాలకు సెర్ప్ ద్వారా అమలవుతున్న బ్యాంకు రుణాల లక్ష్యాలను సకాలంలో సాధించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంఘాల్లో లేని మహిళలను గుర్తించి కొత్త గ్రూప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్డీఓ ఉమాదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు యాత్ర



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కలాంస్ఫూర్తి యాత్ర నిర్వహిస్తున్నామని పారిశ్రామికవేత్త మధులాష్‌బాబు అన్నారు. మంగళవారం బాలికల ఉన్నతపాఠశాలకు కలాం స్ఫూర్తి యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, కౌన్సిలర్ తబస్సూం, ఎంఈఓ కొండాపురం బాలరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు యాత్ర ఎంతో దోహదపడుతుందన్నారు. దసెల్ఫ్‌ఫోర్స్, వందేమాతరం, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామన్నారు. యువ మేధావులను సాధికారత కల్పించడమే లక్ష్యమని 10–16 ఏళ్లలోపు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను ప్రకటికల్‌గా చూపుతూ ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యాత్ర నిర్వహకులు శ్రీజ, అర్చన, అజయ్‌రెడ్డి, దిలీప్‌కుమార్, సాయి సుబ్రమణ్యం, రోహిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.15 వేలు చెల్లించాలి



తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అమరచింత: ఎన్నికల హామీలో రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టించి రైతులకు అన్యాయం చేస్తే సహించబోమని, రైతుల పక్షాన ఆందోళనలు నిర్వహిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నరసింహులు గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామని, ప్రస్తుతం రూ.12 వేలకు కుదించడం సరికాదన్నారు. ఇచ్చిన మాట అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్‌ఏ.రాజు, నరేష్‌రెడ్డి, బాలరాజు, కౌన్సిలర్ రాజ్‌కుమార్, నాగభూషణం గౌడ్, షానవాజ్ ఖాన్, బాలరాజు, జింక రవి, తదితరులు ఉన్నారు.

శ్వాసకోశ వ్యాధుల నివారణపై అవగాహన



వ్యాధుల నివారణపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీహెచ్‌ఓ

పాన్‌గల్: గ్రామాల్లో శ్వాసకోశ వ్యాధులు, క్షయ వ్యాధి నివారణపై పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ప్రతి గ్రామంలో క్షయ, నిమోనియా, సైనస్లు, బ్రాంకైటీస్ మొదలగు శ్వాస కోశ వ్యాధుల నివారణపై, క్షయ రహిత నివారణకు కృషి చేయాలన్నారు. గర్భిణుల వివరాలు తప్పక నమోదు చేయాలన్నారు. సిబ్బంది వారి సబ్‌సెంటర్ల పరిధిలో ఆయా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యం చేయాలన్నారు. ఆరోగ్య మందిర్ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు సుమనశ్రీ, శాంతమ్మ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ కరాటే మాస్టర్‌కు బెస్ట్ ట్రైనర్ అవార్డు



కొత్తకోట: పెబ్బేరు మండలానికి చెందిన కుంగ్ ఫూ కరాటే మాస్టర్ నలవాల విజయ్ బెస్ట్ ట్రైనర్ అవార్డు అందుకోవడం జరిగింది. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి టెన్త్ బెటాలియన్‌లో టీజీఎస్‌పీ–ఎస్‌సీటీపీసీఎస్ 2024 బ్యాచ్‌కి 9 నెలల పాటు కరాటే ట్రైనింగ్ ఇచ్చినందుకు బెటాలియన్ కమాండెంట్ ఎన్‌వీ. సాంబయ్య చేతుల మీదుగా అవార్డు, మెమోంటో, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు మాస్టర్ విజయ్‌ను అభినందించారు.